# పోస్టుచేయని ప్రేమలేఖలు

గాజులు ముంజేతిపైకి లాక్కొని మణియార్డరు ఫాంమీద సంతకం పెడుతుంటే పోస్టు మేన్ కేసి కొరకొరా చూస్తూ నిలబడ్డ జానికమ్మత్త "నీ కస్తూరి ముత్యాలకోవ— ఆ సంతకం చూసి మురిసిపోడూ అతగాడు." అని నన్నూ, నా మొగుడ్నీ, నా సంతకాన్ని పొగిడి పది రూపాయలట్టుకు పోయింది చచ్చి నీ కడుపునపుడతానంటూ— జానికమ్మత్త నోట్లో వున్న రెండంగుళాలన్నర నాలిక ఎట్లాపడితే అట్లా తిరుగుతూ వుంటుంది.

"ఏవిటి ఆ ఉత్తరం చేతిలో...."

"మీ ఆయన రాశాడా, ఎక్కడ్నుంచి ?"

"అంతా కులాసా.... ఏ వంటున్నాడు. భోజనం సదుపాయంగా లేదంటున్నాడా !"

వెకిలి నవ్వు పళ్ళు బైటపెట్టి....ఏం ఆడాళ్లో ఉత్తరం చదువుకోనివ్వరు.

"తిన్నగా వుంటాడా ఏమో నమ్మలేము, ఈ కాలం కుర్రాళ్ళు.... మీ ఆయన సంగతి కాదు నేను చెప్పేది. అతనికేం— బుద్ధిమంతుడే."

"డబ్బు జాగర్తచేసి వుంచమను. బంగారం కొనమను. ఏవన్నా చేయించుకో— ఇది చేయించుకోవడం గొప్పకాదు. దీనికేం అందరికీ అయేదేగా— పిలవకుండా వస్తుంది. గుడ్డలూ గుడుసుల కోసం తగలెయ్యకండి వెర్రి మొహాలు....నాలుగు కాసులుకొని చేయించుకుని ఏవన్నా మెళ్ళో వేసుకుంటే నిండుగా వుంటుంది. పచ్చని పిల్లవు. కాపరాని కెళ్ళి

ఎన్నాళ్ళయింది ? జడగంటలు, నాగరం చెరిపించేసి నెక్లెసు చేయించుగున్నావా ? అయ్యో తెలివి తక్కువ పిల్లా-రేపు ఓ పిల్ల బయల్దేరితే అది పెట్టుకోదూ ? కని పెంచే తల్లివి - ముందుచూపు లేకపోతే ఎల్లాగ ? ఈ చీర వాళ్ళు పెట్టారా....బాగుందమ్మా ! చిలకలా వున్నావు. ఏవిటా ఉత్తరం ? యింకా ఏవేం రాశాడే....ఏవంటాడూ ! వుండలేనంటున్నాడా- దొబ్బుడాయి, ఉత్తరాల్లో అట్లాగే రాస్తారు ఈ మగాళ్ళు ! నమ్మకు- నీకు కోపం రాకుండా వుంటే వోమాట చెబ్తా....అంతలా చనువియ్యకూడదు. తగు మాత్రం దూరంలో వుంచాలి. వుంచితేనే మగాళ్ళు....ఈ ప్రేమలూ దోమలూ అంటే నాకు డోకు. సాయంపడుకుంటాలే. దీపం ముందేసుకు కూర్చుని ఆ వెర్రి మొర్రి పుస్తకాలూ అవి ఎందుకు వఠ్ఠినే చదవడం ? పుణ్యమూ పురుషార్థమూ వో భక్తా ముక్తా- దిక్కుమాలిన రాతలు తలకు పట్టేస్తే బుర్ర తిరిగిపోతుంది ! చదవకు ! సుబ్బరంగా యింతతిని పడుకో దేవుడి పటంకేసి చూస్తూ .... ఆ ఫొటోలు గిటోలు వొళ్లో పెట్టుకు కూర్చోకు....నవ్వుతావేఁ.... వొళ్ళు పొగరు....అణుగుతుందిలే....సందు మొగన సైకిల్ గంట ట్రింగ్ మనగానే పోస్టుమేన్ కోసం అలా పరుగెత్తకు....వాడేవిటి నీకేసి అట్లా చూస్తాడు ? నాకెందుకమ్మా ఏదో, పెద్దదాన్ని నాలుగు ముక్కలు చెప్పాను. చెప్పాలి గనుక. వింటే వింటారు. లేకపోతే గంగలో కలుస్తారు. మనం చెబితే వినేట్లున్నారా ఈ కాలం ఆడపిల్లలు....హాళ్ళపెళ్ళా ఆ విరగబాటు ఆ కులుకు తళుకు అంతా దాచుకో అమ్మా దాచుకో.... అంతలా నవ్వకూ.... నీ మొగుడొచ్చి నీ విరగబాటు అణుస్తాడులే.... ఏం మొగుళ్లో శుద్ధ చవటలు....చెవులు పట్టుకు ఆడించినట్లల్లా ఆడతారు.

"ఆడదానికి వినయం, అణకువ, పెద్దలపట్ల గౌరవం మర్యాద అదీ అందం. జబ్బలదాకా జాకెట్లు అందంకాదు. వొళ్ళంతా పైట పడేసుకుని తిరగడం అందంకాదు. వస్తానమ్మా చెంబెడు నీళ్ళోసుకుని పోయి మడికట్టుకోవాలి. పొద్దు కరకర మంటోంది ! అని బిందెలో

చీర కుక్కుకుని నిష్క్రమించింది జానికమ్మత్త. చదవవలసిన చదువులన్నీ చదివి. చేతిలో ఉత్తరం విప్పితే చదువుకోనివ్వకుండా లాక్కుంటుందేమోనని భయం వేసింది. మొగుడూ పెళ్ళాల ఉత్తరాలలో ఏముంటుందోనని ఈ ముసలాళ్ళ కెందుకో లేనిపోని తహతహ — ఈగలు ముసిరినట్లు ముసుర్తారు. ఉత్తరం చదువుకోవాలంటే ఏ జాకెట్లోనో బొడ్లోనో దాచుకుని తలుపులన్నీ మూసుగు రహస్యంగా దొంగపని చేస్తున్నట్లు చదువుకోవాలి. చీట్లు రాసుగునేప్పుడైతే భయం భయంగానే వుంటుంది. చీట్లు రాసుకోడాలూ, చూసుకోడాలు, చేతులూపుకోడాలు, రాసుకు తిరగడాలు అన్నీ అయాకేగదా ఏదన్నా బ్రేక్ వస్తే ప్రేమ లేఖలు పుట్టేది.

కవరుకు డబ్బులెవర్నన్నా అడగాలి. పెన్ను, కాగితమూ ఆఖరికి పెన్సిలు ముక్క సంపాదించడమూ కష్టమే. ఆ వుత్తరం పోస్టు చేయాలంటే గొప్ప కష్టం. ఎవరు తీసికెళ్తారు? నవ్వుతారు వెకిలిమాటలు వెకిలి చూపులు బరితెగించేసిందంటారు. మొగుడికి వారానికో నెలకో ఓ వుత్తరం రాసుకోడమే కష్టమైపోతే తీరిగ్గా కూర్చుని మనసులోని భావాలను మాల కట్టి మెళ్ళో వేద్దామంటే కుదుర్తుందా? కుదరదు. ఆ అక్షరాలతో మనసులోనిబాధను వెలితిని ఆకాంక్షను చెప్పాలంటే అందరాడ పిల్లలకు సాధ్యమవుతుందా ? ఈ ప్రాణంలేని కాగితం, దానిమీద సిరాతో గిలికిన పంక్తులు ఎటువంటి ఆశలను మేలుకొల్పుతాయి? ఈ కాగితం, ఆ కవరూ. అది మోసుకెళ్ళే రైలు, ఆ పోస్టు సంచీ, ఎంతమంది సాయం చేస్తున్నారు ఒకరి గుండెలోని గుబుళ్ళను మరొకరికి చెప్పుకోడానికి, నా మనసు మక్కువ మదిలో కోరికల్నన్నీ గుది గుచ్చి అక్షరాభిషేకం చేసి మావారి కోసం పంపిస్తే ఆ నా అపురూప ప్రణయ లేఖను తతిమ్మా తుక్కు ఉత్తరాలతో కట్టడానికి ఎన్ని గుండె లుండాలి? ఎంత దుస్సాహసం ? ఆ వుత్తరం చదువుకునేప్పుడు నేను రాసిన పంక్తులకేసి చూస్తూంటే మావారి మొహం ఎంత తమాషాగా వుంటుందో అక్క

డెక్కడన్నా నేను నిలబడి దాక్కుని చూడ గలిగితే గొప్ప సంతోషం కదూ?

ఏమీ తోచదు. తోచనప్పుడు రాసుకున్న ఉత్తరాలే బావుంటాయి. పిలిస్తే పలికే దేవుడు, యింట్లో వుంటే ఖర్మ ఉత్తరాలేం రాసుగుంటాం, పెనసలుతో చీట్లు రాస్తే మావారి క్కోపం ... మొదట్లో కలం పట్టు కోవటం చేతనయ్యేది కాదు. వ్రేళ్ళన్నీ సిరా మరకలు, ఆలోచిస్తూ కూర్చున్నపుడు తెలియకుండా ఆ చేతుల్తో చెంపల్ను రాసుకున్నందుకు చూసి ఎట్లా నవ్వారని మావాళ్ళు .... పోనీ నవ్వితే నవ్వనీయండి, ఈ సిరా మరకల కాగితానికున్న అదృష్టం యీ తనువుకి లేదుగదా అని పిస్తూంటుందోసారి—నిజవే, ఏవిటో రెక్కలు కట్టుకు ఎగరాలనుకుంటే మాత్రం ఎగరగలనా? కంటిచూపు కరువయ్యాక మనసు ఎన్ని పోకిరి పరుగుళ్ళు పెడితే మాత్రం గాలి ఎన్ని పులకరింతలు కలిగిస్తే మట్టుకు "దూరాన నా రాజు" ఎలా వచ్చి నన్ను తన ముద్దూముచ్చటలతో మురి పిస్తాడు? అబ్బ— విరహం అంటారే అదోటి దాటడం మాచెడ్డ కష్టం స్మండి! మంచినీళ్ళ గ్లాసులో మొహం కనిపిస్తూంటే అన్నం ఎలా సయిస్తుంది, చెట్లమీద పిట్టలు ముక్కులతో పొడుచుకుంటూ వెక్కి రిస్తూంటే, ఆకాశంలోని నీలి మేఘాల పరదాల చాటున జాబిల్లి నవ్వుతూ సాగిపోతుంటే, కంటికి కునుకే రాదు. తెల్లటి పక్కమీద మొగలి పువ్వులా పడి వంటరిగా దీనంగా చేతులుచాచి అర్థించడం వినా .... కళ్ళ లోంచి ప్రవాహంలా వచ్చి చెంపలు చెరువై తడిసిపోవడం వినా.... చేయ గలిగిందేముంది? ఏ అజ్ఞాతశక్తో బలంగా పని చేస్తూండబట్టే యిన్ని విరహాలు, కోపాలుతాపాలు కన్నీళ్ళు కంగార్లు.... పిచ్చెత్తిపోయినట్లుంటే, లోకం ముళ్ళపొదలా కఠినంగా హీనంగా చూసి హేళన చేస్తూ నవ్వు తుంటే అబ్బ ఎంతబాధ? ఎంత దిగులు? ఎంత నిరాశ?.... నాకు తెలీదు యీ మొగాళ్ళు యిలా మనకుమల్లే ఎడబాటుకి వగస్తూ తిరుగుతారా? ఏమో పేకాట్లో కూర్చుంటే ప్రేయసెందుకు జ్ఞాపకం వస్తుంది, సిగరెట్లు

తెగ కాల్చేసి గుండెల్లో మంటల్ని ఆర్పుకుంటా రనుకుంటాను. ఇది ఏమంటే విరహాగ్ని జ్వాల మనసుచుట్టూ తిరుగుతూ గుండెల్ని కాలుస్తూ వుంటుంది.

పంతెనమీద రైలు పరుగెడ్తూంటే, రోడ్డుమీద బస్సు బుర్రు బుర్రు మంటూంటే వీధిలో జట్కా టకటక లాడుతూ పోతూవుంటే వాటిల్లో ఒక్కదాంట్లోనేనా మీరు ఉండకూడదూ? హఠాత్తుగావచ్చి నా కిటికీదగ్గర నిలబడి పిలిస్తే ....అలా యెందుకు జరుగుతుంది? మీరెవరో నేనెవరో....కాళ్ళకు నీళ్ళిచ్చి కన్నీళ్ళు నింపి........అంత అదృష్టమా! "నీవులేక వీణ పలుకలేనన్నదీ"-"నీవులేక రాధ నిలువలేనన్నదీ".అంతా నిజమే. నాకల్లాగే అనిపిస్తుంది. మా ఇంట్లో వీణలు లేవు అనుకోండి, నేనే రాధననుకుంటే నా హృదయవీణ పలకలేక మూర్ఛనలు పోయిం దని సర్దుకుంటే సరిపోతుంది. నందివర్ధనం చెట్టుక్రింద నిల్చుని కాలి మట్టెలు సరిచేసుగునేప్పుడు, పైనుంచి ఆకులమీదుగా జారిన మంచు బొట్లు నా తలమీద పడుతూంటే కొంతవూరటగా వుంటుంది. నా కోసం కన్నీరు కారుస్తున్నారెవరో అనిపించి కళ్ళు చెమరుస్తాయి. ఉదయం బొగడ చెట్టు క్రింద పచార్లు చేస్తూంటే, మీదనుండి రాలే బొగడపూలు ఆ సువాసనల్ని మోసుకుంటూ వెళ్ళే చల్లనిపిల్లతెమ్మెరలు మీ కిటికీలోంచి పలకరించి మిమ్మల్ని రాసుకుంటూ పోతాయనుకుంటే - ఎంత తృప్తి, ఎంత ఆనందంగా వుంటుందో చెప్పలేను.

ఏమేమొ మనసులో ఎంచుటే కాని,
తిన్నగా నా కోర్కె తెలుపనే లేదు.

ఇలాటి రక రకాల భావాల్ను కాగితాలమీద రాసి బట్టల పెట్లో నా టాయిలెట్ బాక్సులో పెట్టివుంచా, అవి పోస్టుచేయని ప్రేమలేఖలు. పెట్టె సర్దుతూన్నపుడల్లా అడ్డువస్తూంటాయి. చింపలేను. పారేయడానికి మనసొప్పదు,